క్లుప్తంగా

ఘనంగా మారెమ్మ దేవర



మారెమ్మ దేవిని దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: మండల కేంద్రంలో శనివారం మారెమ్మ దేవర ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంభోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పెద్దబావి వద్ద గంగపూజ నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి కుంభాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అవ్వకు అభిషేకాలు, మహామంగళహారతి, నైవేద్య సమర్పణ, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు వివిధ రకాల వంటలతో దేవికి నైవేద్యం సమర్పించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు



హైస్కూల్‌లో నవోదయ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని పలు ఉన్నత పాఠశాలలతో పాటు బనవాసి నవోదయ, గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో శనివారం జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ –2 మధుసూదన్‌రాజు, జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ పద్మావతి పరిశీలించారు. 9వ తరగతి ప్రవేశానికి 1,502 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 944 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి 1,595 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,238 మంది హాజరయ్యారు.

బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తి అరెస్ట్

● పోక్సో కేసు నమోదు



నిందితుడిని చూపుతున్న సీఐ శ్రీనివాసులు

దేవనకొండ: బాలికను కిడ్నాప్ చేసిన ఓ వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేసి, పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మాదిగ విజయ్ అలియాస్ గడ్డెళ్ల విజయ్ స్థానికంగా ఉండే 14 ఏళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఈనెల 6న కిడ్నాప్ చేశాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. గద్దెరాళ్ల ఆర్చ్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికెళ్లి అరెస్ట్ చేశారు. బైకును సీజ్ చేసి, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని సీఐ తెలిపారు.

జీడీపీలో 1.6 టీఎంసీల నీరు



గాజులదిన్నె ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వ

గోనెగండ్ల: మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టులో శనివారం నాటికి 1.6 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు 4.5 టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం జీడీపీలో 1.6 టీఎంసీల నీరు ఉంది. జీడీపీ నుంచి పైప్‌లైన్ ద్వారా పత్తికొండ, డోన్, కృష్ణగిరి మండలాలకు తాగునీటి కోసం విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి కాలంలో ఆయా మండలాలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

నేటి నుంచి ఇంటర్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20 వరకు జరిగే ఈపరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చి, సెంటర్లలోని ల్యాబ్‌ల్లో నుంచి లైవ్ ద్వారా పర్యవేక్షించేందుకు ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి.

కంట్రోల్ రూం నుంచే పర్యవేక్షణ..!

ఉమ్మడి జిల్లాలో మొత్తం 318 జూనియర్ కాలేజీల నుంచి 20,930 మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. వీరికి మొత్తం 115 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో విధులు నిర్వహించేందుకు 93 మంది ఎగ్జామినర్లు, 77 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. ప్రైవేటు కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా ప్రభుత్వ కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులను నియమించినట్లు ఆర్ఐఓ గురవయ్య శెట్టి తెలిపారు.

అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

● పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



వెల్దుర్తిలో వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

వెల్దుర్తి(కృష్ణగిరి): అకాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం వెల్దుర్తిలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. మండలంలోని 847 గ్రూపులకు చెందిన 8,561 మందికి నాలుగో విడత రుణమాఫీ రూ.4,94,71000ల చెక్కును మహిళలకు అందించారు. లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం తన పాదయాత్ర సందర్భంగా తాను అధికారంలోకి వస్తే దశల వారీగా పొదుపు మహిళల రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీ మేరకు, అధికారం చేపట్టిన నాటికి నిల్వ ఉన్న రుణాలను నాలుగు విడతులగా మాఫీ చేసి హామీ నిలబెట్టుకున్నారన్నారు. రాష్ట్రం విడిపోయి ఆర్థిక పరిస్థితి బాగో లేకున్నా, కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించారన్నారు. మరోసారి జగనన్నను ఆశీర్వదించి గెలిపించాలని కంగాటి శ్రీదేవి కోరారు.

మహిళలను గౌరవించడం నేర్చుకో

మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని టీడీపీ నియోజకవర్గ నాయకుడు కేఈ శ్యాంబాబుకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హితవు పలికారు. ఇటీవల తనను బహిరంగంగా అగౌర పరిచేలా మాట్లాడం సిగ్గుచేటన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి ఆ పార్టీ నియోజకవర్గ నాయకుల వరకు మహిళలంటే గౌరవం లేదన్నారు. ఇలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీ బొమ్మన సరళా రవిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ శైలజ, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి వెంకట్ నాయుడు, ఏపీఎం చంద్రశేఖర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తులసీరెడ్డి పాల్గొన్నారు.

● వైఎస్సార్ ఆసరా, పొదుపు రుణం ద్వారా తాను జ్యూట్‌బ్యాగుల తయారీ, వ్యాపారంతో, జగనన్న అమ్మ ఒడి ఇతరత్రా ద్వారా తాను ప్రతి నెలా రూ.10వేలు సంపాదించుకోగలుగుతున్నానని వెల్దుర్తి హనుమాన్ గ్రామైక్య సంఘం సూర్య గ్రూప్ పొదుపు మహిళ సరోజ సంతోషం వ్యక్తం చేశారు.

● వైఎస్సార్ ఆసరా, ఇతరత్రా ద్వారా దుస్తుల దుకాణం పెట్టుకుని నెలకు రూ.10 వేల నుంచి రూ.20వేలు సంపాదించుకోగలుగుతున్నానని గణేశ్ గ్రామైక్య సంఘం అశ్విని పొదుపు గ్రూప్ మహిళ లక్ష్మీప్రసన్న ఆనందంగా తెలిపారు.

● వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతలుగా తాను పొందిన రూ.40 వేలతో పాటు పొదుపు రుణం తీసుకుని చీరల వ్యాపారంలో పెట్టుబడి పెట్టి నెలకు రూ.10 వేలకు పైగా సంపాదించుకోగలుగుతున్నానని రాణితోట గ్రామైక్య సంఘం లలిత గ్రూపు మహిళ లలిత సంతోషం వెలిబుచ్చారు.

నర్సాపురంలో అభివృద్ధి పనుల ప్రారంభం

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం ఆమె వెల్దుర్తి మండలం నర్సాపురం గ్రామంలో రూ.90 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. సర్పంచ్ ఈరమ్మతో కలిసి జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.29.90 లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన 40 వేల లీటర్ల కెపాసిటీ ఓవర్‌హెడ్ ట్యాంకును, దళిత వాడలో ఏర్పాటు చేసిన ఇంటింటి కులాయిలను ప్రారంభించారు. ఉపాధి నిధులతో పీఆర్ ఆధ్వర్యంలో రూ.38.15లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.21.08 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాలను ప్రారంభించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, నర్సాపురం నాయకులు పాండు రంగారెడ్డి, నర్సింగ్ కృష్ణారెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ శివశంకరప్ప తదితరులు పాల్గొన్నారు.



నర్సాపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఘనంగా చింతలముని, నల్లారెడ్డి స్వాముల ఆరాధన

ఆస్పరి: తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వాముల ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణాధారణ, కలశ స్థాపన, అభిషేకాలు, గణపతి, సుదర్శన హోమం, మహా మంగళహారతి, ప్రాతఃకాల పూజ, పంచామృతాభిషేకం, రుద్ర, నవగ్రహ హోమం, కూష్మాండ బలి, పూర్ణాహుతి, గణపతి హోమం, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని వివిధ గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ పార్వతి, సర్పంచ్ శంకరమ్మ పాల్గొన్నారు.

కేసు నమోదు

దేవనకొండ: కులం పేరుతో దూషించిన విషయంలో ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. మండలంలోని జిల్లెడుబుడకల గ్రామానికి చెందిన ఇమామ్, పంచాయతీ కార్యదర్శి బి.శివశంకర్‌సింగ్ ఇటీవల అనే గొడవ పడ్డారు. ఇదే సమయంలో అక్కడే ఉన్న మాదిగ హరిస్వామి కలుగజేసుకుని సర్దిచెప్పేందుకు వెళ్లాడు. ఈక్రమంతో తనను ఇమామ్‌సా కులం పేరుతో దూషిస్తూ చంపుతానని బెదిరించాడని హరిస్వామిని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

● వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి



ఐనకల్లులో మహిళలతో మాట్లాడుతున్న విరుపాక్షి

ఆస్పరి: పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి అన్నారు. శనివారం మండలంలోని ఐనకల్లు, కల్లపరి, యాటకల్లు, తొగలుగల్లు, తురువగల్లు, తంగరడోణ గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఇంటింటికి తిరిగి అప్యాయంగా పలకరిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందాలంటే మరోసారి జగనన్నకు ఓటు వేసి ముఖ్యమంత్రిని చేసుకోవాలని వివరించారు. ఐనకల్లు, కలపరి, తొగలగల్లు గ్రామాల్లో తాగు నీటి సమస్య ఉందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సుధమ్మ, శంకరమ్మ, లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఆలూరు: నంచర్ల గ్రామంలోని ఉలిగమ్మవ్వ ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి రూ.20 వేలు విరాళమిచ్చారు. శనివారం చిప్పగిరిలోని తన స్వగృహంలో తనను కలిసిన నంచర్ల గ్రామస్తులకు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపించాలని కోరారు.

జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం

● ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. శనివారం స్థానిక శిల్పా ఎస్టేట్‌లో పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. అంతకుముందు పార్టీ జెండాని ఆవిష్కరించి పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుట్టా రేణుక బరిలో ఉంటుందన్నారు. భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బుట్టా రేణుక మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధిపొందిందన్నారు. పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిలతో కలిసి పనిచేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రభుత్వం చేసిన మంచిని వివరించి ఓటు వేయాలని కోరాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బుట్టా రేణుక భర్త బుట్టా నీలకంఠ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, వక్ఫ్‌బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, పట్టణ కార్యదర్శి యుకె వీరేంద్ర, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుక

తీరని ట్రాఫిక్ సమస్య

హొళగుంద: స్థానిక బస్టాండ్‌తో పాటు ప్రధాన రోడ్డులో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు. ఇటీవల కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ పెద్దయ్యనాయుడు కూడా ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలను నిలబెట్టాలని దుకాణాల యజమానులు, వాహన చోదకులకు కోరుతున్నారు. అయినా వాహన చోదకులు తమతీరును మార్చు కోకపోవడంతో బస్టాండు మధ్యలో నిలబెట్టి వాహనాల సంఖ్య మరింత పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాలకు వచ్చే వారు తమ వాహనాలను బస్టాండ్ మధ్య వరకు నిలబెడుతున్నారు. దీని కారణంగా బస్సులు, లారీలు ఇతర వాహనాలకు స్థలం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఇక రాత్రి సమయంలో రద్దీ ఎక్కువై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండులో వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపిన దృశ్యం

అనారోగ్యంతో సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ మృతి

తుగ్గలి: ఉప్పర్లపల్లి సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ పి.కొత్తూరు ఎస్ వెంకటరామిరెడ్డి (64) అనారోగ్యంతో మృతి చెందారు. ఏడాదిన్నరగా కాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య భాగ్యమ్మ ఉన్నారు.

కోడుమూరు వాసిగా గుర్తింపు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి రైల్వేస్టేషన్ ఆవరణలో శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు కోడుమూరు వాసి ఎర్రపురెడ్డిగా గుర్తించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి శనివారం తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తిగా తాము కర్నూలు ఆసుపత్రికి చికిత్సకు తరలించగా, పత్రి కల్లో వచ్చిన వార్తల ద్వారా తెలుసుకున్న బాధితుని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని గుర్తించారన్నారు. చాలా రోజులుగా ఇంటి నుంచి వెళ్లిపోయి వివిధ ప్రాంతాల్లో తిరిగే వాడని, వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న బాధితుని ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు.

కులాల మధ్య చిచ్చు పెట్టొద్దు

మద్దికెర: ఎమ్మార్పీఎస్ ముసుగులో స్వార్థం కోసం కులాల మధ్య చిచ్చు పెట్టొద్దని ఇరిగేషన్ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు వెంకటేశ్వర్లు హితవు పలికారు. శనివారం స్థానిక కమ్యూనిటీ హాలులో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆంజనేయులు, మల్లికార్జున, శ్రీనివాసులుతో కాలసి వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు రహదారిలో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు పేదలకు పంపిణీ చేసేందుకు సిద్ధమవ్వగా అడిగినన్ని ఇళ్ల పట్టాలు ఇవ్వడం లేదనే అక్కసుతో ఎమ్మార్పీఎస్‌ను అడ్డుపెట్టుకుని కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆపార్టీకి భజన చేసి, ఇప్పుడు ఎమ్మార్పీఎస్ అని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. గతంలో పట్టాలున్నాయంటూ దొంగ పట్టాలు చూపించి అధికారులను సైతం బోల్తా కొట్టించారన్నారు. విచారణలో దొంగ పట్టాలుగా అధికారులు నిర్ధారించారన్నారు. పేదలందరికీ పంపిణీ చేయాలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రయత్నిస్తుంటే అనవసరంగా అభాండాలు వేయడం పద్ధతి కాదన్నారు. సమావేశంలో ఎంపీటీసీ ఆంజనేయులు, సచివాయల కన్వీనర్ కవి, మాజీ సర్పంచ్ కన్నప్ప, హరి, చంద్ర, వరప్రసాద్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజావలి, నాయకులు కిట్టి, గోపాల్ ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

క్రీడల్లో ప్రతిభ చాటాలి

మద్దికెర: క్రికెట్ పోటీల్లో ప్రతిభను చాటి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని శ్రీవిద్యాసాయి విద్యాసంస్థల కరస్పాండెంట్ వెంకట్‌మాధవ్, ఎంపీపీ అనిత, ప్రిన్సిపాల్ సునీత సూచించారు. శనివారం శ్రీవిద్యాసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సూపర్ సెవెన్ క్రికెట్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కరస్పాండెంట్ వెంకట్ మాధవ్

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

ఆలూరు: పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ కార్యకర్తలకు సూచించారు. శనివారం ఆయన కురుకుంద గ్రామ సర్పంచ్ దేవిరెడ్డితో కలిసి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన మంచిని వివరించి మరోసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నాగవేణి, ఎంపీటీసీ సభ్యులు దేవరాజ్, బోయ ఎల్లమ్మ, జీరనాగమ్మ, సింగిల్ విండో చైర్‌పర్సన్ హనుమంతమ్మ, డైరెక్టర్లు, వెంటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాడు శిథిల బాట.. నేడు రాచబాట



పగిడిరాయి–రామలింగాయపల్లి మధ్య రోడ్డు దుస్థితి



పగిడిరాయి–రామలింగాయపల్లి మధ్య మెరుస్తున్న రోడ్డు

తుగ్గలి : మండల పరిధిలోని జొన్నగిరి నుంచి రామలింగాయపల్లి వెళ్లే రహదారి చాలాచోట్ల గుంతలు పడి ప్రయాణికులకు నరకం కనిపించేంది. ఇక వర్షాకాలంలో అయితే వాహనదారుల అవస్థలు వర్ణణాతీతం. నాటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో పంచాయతీ రాజ్ నిధులు రూ.1.99 కోట్లతో మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లకు తమ ప్రయాణ కష్టాలు గట్టెక్కాయని సంతోషిస్తున్నారు.

ఇబ్బందులు తప్పాయి

గతంలో ఈ రోడ్డు పూర్తిగా గోతులతో ఉండడంతో అవస్థలు పడేవాళ్లం. గుంతల రోడ్డులో పలుమార్లు ప్రమాదాలు చోటుచేకున్న ఘటనలు కూడా ఉన్నాయి. రోడ్డు వేయడంతో ఇబ్బందులు తీరి ప్రయాణం సాఫీగా సాగుతోంది. సమస్య తీర్చినందుకు ఎమ్మెల్యే శ్రీదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– నాగిరెడ్డి, రామలింగాయపల్లి



రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

గోనెగండ్ల: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సీఐ రామకృష్ణయ్య సూచించారు. శనివారం సాయంత్రం ఆయన గాజులదిన్నె ప్రాజెక్ట్ స్టేజీ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి చలానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహదారులు హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంగా వాహనాలు నడపరాదన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రామకృష్ణయ్య

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

● సెర్ప్ సీఈఓ ఇంతియాజ్



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

కృష్ణగిరి: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ ముఖ్య కార్య నిర్వహణాధికారి, సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ మహిళలకు సూచించారు. మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో శనివారం ఆయన సర్పంచ్ లక్ష్మీఈశ్వరయ్య, ఎంపీటీసీ తలారి కృష్ణయ్యతో కలిసి పొదుపు సంఘాల మహిళలు ఏర్పాటు చేసుకున్న మినీ పౌల్ట్రీ యూనిట్లను ప్రారంభించి, లబ్ధిదారులకు నాటు కోడి పిల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు కోళ్ల పెంపకం వల్ల ఇతర జిల్లాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. దీన్ని జిల్లాలో అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకు సెర్ప్, హిఫర్ (హెచ్ఐఎఫ్ఈఆర్) ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో నాటు కోడి పిల్లలను అందించి వాటికి దాణా, సంరక్షణలో మెలకువలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పొదుపు సంఘాల్లో ఉన్న ప్రతి మహిళ ఏదో రంగంలో రాణించేందుకు ముందుకు వస్తే బ్యాంకుల ద్వారా రుణం అందించి ప్రోత్సహిస్తామన్నారు. మినీ పౌల్ట్రీ ఏర్పాటుకు ప్రతి మహిళకు రూ.40వేలు బ్యాంక్ రుణం అందించి, స్వచ్ఛంధ సంస్థ ద్వారా కోడి పిల్లలు ఉచితంగా అందిస్తామన్నారు. మూడు నెలలు వీటిని పోషిస్తే మంచి ఆదాయం వస్తుందన్నారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా మరో 200 యూనిట్లు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వీఓఏలు సీఈఓను శాలువ, జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ–ఐకేపీ పీడీ సలీమ్‌బాషా, హిఫర్ పీడీ శ్యాంకుమార్, ఏపీడీ శ్రీధర్‌రావు, అబ్దుల్‌రహిమాన్, డైరీ డీపీఎం అనిల్‌కుమార్, జీవనోపాధులు డీపీఎం నర్సమ్మ, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, పశువైద్యాధికారులు నవీన్, రమేష్, ఏపీఎం మహేశ్వరయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరోజమ్మ పాల్గొన్నారు.

వెల్దుర్తిలో..

మండల కేంద్రానికి చెందిన పొదుపు గ్రూపు సభ్యురాళ్లు సుంకులమ్మ, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ ఏర్పాటు చేసుకున్న మినీ పౌల్ట్రీ యూనిట్లను సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ ప్రారంభించారు. ఒక్కొక్కరికి 50 నాటు కోడి పిల్లలను అందించారు. ఈ పిల్లలను జాగ్రత్తగా పెంచుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులతోపాటు ఏపీఎం చంద్రశేఖర్, పశువైద్యాకారి శాంతలత, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామ శివారులో శనివారం 10 లీటర్ల నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నాటుసారా కలిగి ఉన్న నిందితుడు అదే గ్రామానికి చెందని నక్క నాగభూషన్ పారిపోగా కేసు నమోదు చేసి గాలిస్తున్నామన్నారు